అరకు లోయలో కూలిన శిఖరం

ఆ పచ్చటి పర్వతశిఖరాలు నీలి ఆకాశాన్ని మేలి ముసుగులా కప్పుకున్న తెల్లమేఘాన్ని అన్వేషించి, అందుకో లేక అలసి, కిందికి క్రుంగి లోయగా సాగారి నగ్నంగా పవ్వళించిన ఏకాంతకన్యలు, విషాదంలో జుట్టు విరబోసుకున్నట్లు చుట్టూ దట్టమైన అడవి.... పెనవేసుకున్న ముంగురులులా వికృతమైన చెట్ల మ్రానులు, విరిగిన మొదళ్లు, వర్షపునీటికి చారలుతేరిన నల్లకొండరాతి బీటలు; ఆశకి భ్రమించి కళ్ళు తెరచినట్లు శిఖరాలమధ్య విడిన మబ్బునీడలు—వక్షాలమధ్య బాధతో జారిన కన్నీరుమాదిరి, వంకరులు తిరిగి అదృశ్యమయ్యే రోడ్డు, సగం ఎండిన పిల్లనదీ—తమ అందానికి సిగ్గుతో తలలువొంచి పాదాలకేసి చూసుకున్నట్లు, కిందికి, యింకా కిందికి, యింకా యింకా కిందికి, అధోలోకంలోకి దిగజారిపోతున్న ఆ దృశ్యం. ఆ అనుభవం. అరకులోయ.

సముద్రమట్టానికి రెండువేల అడుగుల ఎత్తున వున్న చల్లటి ప్రదేశం అరకులోయ. చుట్టూ పెద్ద కొండలు, అడివి. మధ్యగా ప్రవహించే పిల్లనది. సారవంతమైన నేల. సుందరమైన ఆ దృశ్యాలు. విశాఖపట్నం నుండి మాచ్‌కండ్ జలవిద్యుత్ కేంద్రానికి వెళ్ళే యాత్రికులను ఆకర్షించాయి. ఇక్కడ వ్యవసాయం సాగించి. విద్యుత్ సహాయంతో ఒక మహాపట్టణాన్ని నిర్మించాలని పథకాలున్నాయి. మలేరియాని అరికట్టాలి; వసతు లేర్పాటుచెయ్యాలి; కాలవలు తవ్వాలి; ఇక్కడ స్థిరపడిపోవడానికి సిద్ధపడ్డ వ్యక్తులు

కావాలి; మాచ్‌కండ్ నుండి విద్యుత్ యీ లోయకుండా నడిపి, వొక నాగరికత నెలకొల్పాలని ఎందరెందరో కలలుకంటున్నారు.

కాని కార్యానికి పూనుకున్నవారు లేరు; అది నిర్మానుష్యమైన అడవిప్రాంతం: కొద్దిమంది కొండజాతివారు అక్కడక్కడ కనబడి క్షణంలో మాయమవుతారు. సృష్టి ఆదిలో అల్లా వుండేదేమో ననిపిస్తుంది. చెట్లు, మనుషులు, కొండలు, మేఘాలు, మృగాలు— అన్నింటికీ ఒకే చైతన్యం. నాగరికతలో మరణించి, చరిత్రగతంలో జనించడంలాంటిది అరకులోయ సహవాసం.

అందుచేత ప్రస్తుతం అందరి దృష్టి మాచ్‌కండ్‌పై మరలింది. మాచ్‌కండ్‌నది జలపాతం సహాయంతో పెద్ద జలవిద్యుత్ కేంద్రం నిర్మాణమవుతోంది. అది పూర్తి అయింతర్వాత అరకులోయ వలస స్థాపన.

అది పూర్తిచేసే పనిమీద మాచ్‌కండ్ వెడుతున్న ఇంజనీర్ వర్మ పట్టాపొందిన తర్వాత ఒకటి రెండేళ్లు ఇంజనీరింగ్ కాలేజిలో లెక్చరర్‌గా పనిచేసి, స్కాలర్‌షిప్‌మీద మేన్‌చెస్టర్‌లో పైచదువు పూర్తిచేసి పెద్దడిగ్రీ పొంది రాగానే, మాచ్‌కండ్ నిర్మాణశాఖ వారికి సలహాదారుగా నియమించారు. ఇదే అతను ప్రధమంగా మాచ్‌కండ్ రావడం. తను ముందుగా వెళ్ళి బంగాళా అదీ ఏర్పాట్లు చేసేంతర్వాత, సామాన్లు, సిబ్బందితో ఆ మరుసటిదినం అతనిభార్య రావడానికి ఏర్పాటు చేసుకొని ప్రయాణమై చక్కా వొచ్చాడు.

స్టేషన్‌లో దిగగానే ఆశాభంగమైంది. మాచ్‌కండ్ అధికారులు తనకోసం పంపుతామన్న వాగన్ పంపలేదు. గుమాస్తా సోమయ్యని మాత్రం ఆహ్వానానికి స్టేషన్‌కి పంపారు.

సోమయ్య మాచ్‌కండ్ వుద్యోగైనా విశాఖపట్నం రవాణా బ్రాంచిలో పనిచేస్తున్నాడు. వాగన్ ఎందుకు రాలేదో అతనికి తెలీదు. దోవలో చెడిపోయిందేమో? వర్మగారి వుత్తరం వారికి సమయానికి చేరలేదేమో? తనే పలుకుబడితో వొక జీప్ సంపాదించాడు. ఉదయం ఆరుగంటలకి కొండ రోడ్‌మార్గాన, నూటముప్ఫైమైళ్ళ జీప్ ప్రయాణం సాగించారు.

వర్మ ఇంగ్లండులో పై చదువుపూర్తి చేసినవ్యక్తి అంటే నమ్మడానికి వీలుగా కనబడతాడు. డబుల్ బ్రెస్టుకోటు. పైపై, అరు పచ్చ కళ్ళజోడు, సిగరెట్ టిన్, లెదర్ కేస్-యీ వ్యక్తి పాపం! జీప్‌లో ప్రయాణం చెయ్యాల్సివొచ్చింది. అనుకున్నాడు సోమయ్య వెనకసీట్లో. సాధారణ పంచకట్టు, ముతకచొక్కా, పైన కండువా. సోమయ్యవాలకంచూస్తే, చాలా అల్పుడైన వుద్యోగిలా వున్నాడు. అతన్నేనా, ఆహ్వానానికి మాచ్‌కండ్ అధికార్లు పంపవల్సింది? వెళ్ళ గానే అడగాలి. ఇంకా నయం, భార్య స్నేహలత తనతో వొచ్చింది కాదు ఇదంతా చూసి, ఏమనుకునో్న! నలుగురైదుగురు బంట్రో తులు, రెండుకార్లు, పెద్దపెద్ద వుద్యోగులు, రైలు దిగగానే సిద్ధంగా వుంటారని వర్మ వూహించుకున్నాడు. కాసేపు కోపగించుకున్నాడు— ప్రమాదకరమైన మలుపులు. జీప్ ముందు ప్రాణంకోసం పరుగెడు తున్న కుందెలు, వింజామరలు వీస్తున్న చెట్లకొమ్మలు, గార్డ్ ఆఫ్ ఆనర్ యిచ్చి సాల్యూట్ చేసి నిలిచిపోయిన రాతిబండలు—వీటిని గమనించనేలేదు వర్మ.

మలుపులో సూర్యకిరణం, కత్తిలా పొడిచింది. చెట్ల ఆకుల నుంచి జారుతున్న మంచుకణాలు ఇంద్రధనుస్సులా విరిగి వెయ్యి కత్తుల వెలుగుతో బద్ధకించిన చూపుని చీలుస్తున్నాయి. వర్మ కోపం దిగమింగుకున్నాడు. దేశానికి స్వాతంత్ర్యం వొచ్చింతర్వాత జరిగిన మార్పుకి అది చిహ్నం అనుకోకూడదు? వెనకటి, వొంగి సలాములు, జోహార్లు, బందోబస్తు, పటాటోపం తను ఆపించకూడదు, ప్రజలలో నూతన వికాసం, వ్యక్తిత్వం స్వతంత్ర జిజ్ఞాస ప్రబలినాయి.

కొండ దిగుతున్నారు. కింద ఆకుపచ్చచీర కొంగువిప్పి పరున్న లోయ—పచ్చజోడులోంచి మరింత పచ్చగా కనబడు తోంది. ఎండకి కొండలు విరిగిపడ్డట్లు. అదృశ్యమౌతున్నాయి. ముందుకి పడిపోకుండా గట్టిగా పట్టుకున్నాడు. గుప్పున చెమటవాసన వేసింది. డ్రైవరు స్నానం చేసినట్లు లేదు. కోటు విప్పాడు. పై వొదులుచేశాడు. జీపు నిలిపి, సోమయ్యని ముందుకు పంపి, తను

వెనకసీట్లో కూర్చున్నాడు. ఎనభై మైళ్ళ ప్రయాణంతో వర్మ అలసిపోయ్యాడు.

జీప్‌కూడా అలసిపోయింది. కదలడం లేదు. ఏదో చెడింది. డ్రైవర్ రిపేరింగ్ సాగించాడు. అరకులోయలో యాత్రీకుల బంగళా యింకా ఆరుమైళ్ళుంది. మాచ్‌కండ్‌నుంచి ఏదేనా వేగన్ రావచ్చు. మరో పాసింజర్ బస్ తగలొచ్చు. కాసేపు ఆ చెట్టుక్రింద విశ్రాంతి తీసుకుందాం అన్నాడు సోమయ్య.

వర్మ ఫ్లాస్కులో టీ కాస్త పోసుకు త్రాగాడు. సిగరెట్ ముట్టించాడు. చల్లగా గాలి వీస్తున్నా అతని వొళ్ళంతా వేడెక్కింది. చుట్టూ చూశాడు—అన్నీ గుట్టలు, పొదలు, పెనవేసుకున్న చెట్లు, ఆ రాళ్ళమధ్య కింద, దూరంగా కొలను. బైనాకులర్స్ తీశాడు. అవును నీరే. ఎక్కడిదో? ఎక్కడి నుంచి పుడుతుందో ఎవ్వరికీ తెలీదు—ఆ విధంగా అక్కడక్కడ జలం వూరుతుంటుంది. అదొక వింత, అన్నాడు సోమయ్య. వర్మ కిందికి రాళ్ళల్లోకి దిగాడు. నీళ్ళు స్వచ్ఛంగా వున్నాయి. అడుగున యిసికె, నాచు కనిపిస్తున్నాయి. దోసిలితో తీసుకొని మొహం తడుపుకున్నాడు. మళ్లా ఆ పచ్చటి నీడలమధ్య జారుతున్న నీటిని చూశాడు. ఇంకా కింద, యిరవై అడుగుల దిగువున, మరొకకొలను చుట్టూ రాతిబండలు, సూర్యరశ్మిని అల్లికపొద-నగ్నంగా స్నానం చేస్తున్న వొకస్త్రీ బైనాకులర్స్‌లో కనిపించింది. తీక్షణంగా చూశాడు. నడుంకి కాస్తంత ఎర్రబట్ట వుందేమో—బలంగా స్ఫుటంగా యవ్వనం తీరికగా తీర్చిదిద్దిన ఆమె అవయవాలు అతని అస్థిపంజరాన్ని కదిల్చాయి.

'ఆ నీళ్ళు మాత్రం త్రాగమోకండి' అని పైనుంచి సోమయ్య కేకవేశాడు. వర్మ ఎందుకో వులిక్కిపడి పైకి వొచ్చేశాడు.

'నీళ్ళు మంచివి కావంటా రండి' అన్నాడు సోమయ్య. ఒక రాతిమీద దులుపుకొని, కారుసీటు తలకింద పెట్టుకుని వెన్నువాల్చాడు వర్మ.

'ఈ ప్రాంతంలో మనుషులెవళ్ళూ వుండరా?'

'ఉండకేమండి—కొండజాతివాళ్ళు. మందువాళ్ళు. అక్క-

దక్కడ పనలుతూనే వుంటారు. కొందరేమో మాచ్‌కండ్ పోయి కూలిచేసుకుంటారండి.'

'ఇక్కడేమీ ఇళ్ళు కనబడవేం?'

'వాళ్ళకి యిళ్లెందుకండి—కొండగుహల్లోనూ, చెట్లకిందా తిరుగుతూ వుంటారండి' అన్నాడు సోమయ్య, ఆవులింతని ఆపుకుంటూ.

'మరి భుక్తి?'

'ఏదో పండించుకుంటారండి, వేటాడి మాంసం, తేనె తీయడం. మూలికలు అమ్మడం- అల్లాగే గడుపుకుంటారండి.'

సోమయ్య ఆవులింతల్ని ఆపలేకపోతున్నాడు. తనూ జీప్‌లో కెళ్ళి కన్ను మూశాడు.

మళ్ళా బైనాక్యులర్స్‌తో కిందికి చూశాడు వర్మ. స్నానం చేస్తున్న స్త్రీ లేదు. నాలుగు మూలలా చూశాడు. ఎక్కడా కన బళ్ళేదు. పాశ్చాత్య శిల్పకళలోతప్ప అతనెప్పుడూ అల్లాంటి శరీర సౌందర్యం చూడలేదు. మనవారి ఆచారాలు, బట్టకట్టు, అలవాట్లు, సహజ సౌందర్యాన్ని వికసించనీకుండా చేస్తాయని వర్మ వూహ. పాశ్చాత్య స్త్రీల శరీరాలు కొంత మెరుగు. పొదల మధ్య, కాళ్ళు నీళ్ళలో మరుగుపడి పూర్తిగా కనబడని అవయవాలతో యిందాక తను చూసిన స్త్రీ, వీనస్‌డిమైలో శిల్పంలాగ వుంది. ఛాయ మామూలు నలుపే, మొహం సరిగ్గా కనపడలేదు. కాని ఆ బలమైన అవయవాలు. స్థిరపడిన కండరములు, యుగయుగాల రాపిడికి కూడా చెదరని రాతి చెక్కడాలకి మల్లె, దేనికీ లెక్క చెయ్యని ఆ రొమ్ములు-యిసుకలో తలదూర్చి, సృష్టిసౌందర్యం భరించలేక ఏడవాలనిపించే ఆ మూర్తి, వర్మని వొక సహజమైన పురుషుణ్ణిగా మార్చింది. ఏవేవో వింత భావాలు, విపరీతమైన పులకరింపు. అతను స్పృశించలేని సత్యానికిమల్లె వూహలో బంధించ బడాల్సిందే!

సోమయ్య, డ్రైవరు అటుపోతున్న ఎడ్లబండిని నిలిపి, దానికి జీప్‌ని కట్టి, మళ్ళా ప్రయాణం సాగించారు. బంగళాకి చేరుకునేప్పటికి, చీంటిగం టైంది. వారికోసం మాచ్‌కండ్‌లో బైలు

దేరిన వేగను అక్కడ నిలిచింది. ఇద్దరు వ్యక్తులు మందహాసం చేశారు. ఒకాయన ముందుకొచ్చి నమస్కారం చేసి, వొక చీటీ యిచ్చాడు వర్మకి. రెండో వ్యక్తి దూరంగా నిలబడే తల పంకించాడు. అతడు నమస్కారం చెయ్యనందుకు వర్మ విసుక్కున్నాడు. చీటీ చదువుకున్నాడు. వేగను ఎందుకు సకాలానికి పంపలేక పొయ్యారో తెలిపి మాచ్‌కండ్ బంగళా మొన్నాడు కాని ఖాళీ అవదుగనక, అంతవరకూ అరకులోయ బంగళాలో వుండవల్సిందని అధికారులు కోరుతూ వ్రాసి పంపిన వుత్తరం అది. వర్మకి పూర్తిగా కోపమొచ్చేసింది. కాని ఎవరి మీద, ఎల్లా ప్రకటించాలో అతనికింకా తెలీడం లేదు.

'నాకు మీ వేగను అక్కర్లేదు—రేపు ఉదయం స్టేషనుకెళ్ళి సరిగ్గా పదింటికి అమ్మగార్ని, సామానులు తీసుకురండి - మీతో సోమయ్య కూడా వొస్తాడు. ఇక్క డేమన్నా భోజనం దొరుకుతుందా?' అన్నాడు వర్మ.

'కారియర్ తెచ్చామండి' అన్నాడు చీటి తెచ్చిన వ్యక్తి తమ్మయ్య.

సామాన్లు, వర్మ బంగళాలో ప్రవేశించారు. దూరంగా వ్యవసాయశాఖవారి ఒకటి రెండు యిళ్ళు, టీ దుకాణం తప్ప మనిషి అలజడిలేదు. కోటు, జోళ్ళు విప్పి, వర్మ భోజనానికని బల్లదగ్గర కొచ్చాడు. కారియర్ విప్పి, అన్నీ సిద్ధంచేసి వుంచారు. కాని కారియర్‌లో అన్నం మాత్రం లేదు. వర్మ వొళ్ళు మండిపోయింది. ఏమిటిదని గర్జించాడు.

'కోతులు ఎత్తుకెళ్ళనాయి కాబోసండి' అన్నాడు తమ్మయ్య చేతులు నలుపుకుంటూ.

'మీ ఏర్పాట్లు బాగున్నై. మాచ్‌కండ్‌లో పన్లు సాగడం లేదంటే ఆశ్చర్యమేముంది! మీ బోటిగాళ్ళందరూ పూనుకున్నప్పుడు.' ఆ వెటకారానికి దూరంగా గేటు దగ్గర నిలబడ్డ వ్యక్తి నవ్వాడు. అక్కడక్కడ చిరిగిన లాల్చీ, నాలుగు రోజులు కత్తి తగలని గడ్డం, ఖద్దరు పైజామా, చేతిలో రెండడుగుల పొడవుగల పెలి

స్కోప్, దీనంగా నిశ్చలంగా చూసే కళ్ళు —అదీ అతని ఆకారం. నవ్వుకుంటూ వెళ్ళాడు ఆ వ్యక్తి. వర్మ టీ కోసం ప్లాస్కు బోర్లించాడు. బుట్టలో వున్న బ్రెడ్ తీసుకొని. కొయ్యపండానే తినడం సాగించాడు. మాసిన గడ్డం వ్యక్తి, అరగంటలో ఓ కుర్రాడి నెత్తిన అరటి పళ్ళు, వొకసోడా కాయలో నీళ్ళు, మరొక సోడాకాయ లోటీ, పెట్టించి, తీసుకొచ్చాడు. ఇవన్నీ వర్మకి అందజెయ్యమని తమ్మయ్యతో చెప్పి వెళ్ళిపోయాడు.

అందరూ తలోవైపుకూ వెళ్ళారు, సోడాకుర్రాడు గంగడు తప్ప. వాడు మండువాలో పడుకున్నాడు. వర్మ పడుకొని లేచేటప్పటికి మూడు గంటలు దాటింది. గంగణ్ణి లేపి నీళ్ళు తీసుకు రమ్మన్నాడు. మొహం కడుక్కొని, కొత్తబట్టలు వేసుకుని. గంగణ్ణి వెనకాల సీటులో కూర్చోమని, వర్మ జీప్‌నడపడం సాగించాడు. టీ దుకాణంలో యిద్దరూ టీ త్రాగి ప్రయాణం సాగించారు.

"మాచ్‌కండ్ అటుగా దండి. ఇటండి. అది మీ రిందాకా వొచ్చిందేనండి' అన్నాడు గంగడు.

"నాకు తెలుసులేరా."

నీ రుబికిన రాతిబండల దగ్గర కొచ్చారు పావుగంటలో.

జీప్ ఆపుచేసి, వర్మ రాళ్ళమధ్య నీళ్ళల్లోకి దిగి చూశాడు. ఎవ్వరూ లేరు. కొండ పైకి చూశాడు, ఒక కొమ్మను ఆనుకుని గడ్డం పెరిగి లాల్చీ వేసుకున్న వ్యక్తి టెలెస్కోప్‌లోంచు చూస్తున్న దృశ్యం కనబడింది. బైనాక్యులర్స్‌లోంచి జాగ్రత్తగా చూశాడు. ఆ వ్యక్తికి గడ్డం లేదు. క్షౌరం చేసుకున్నాడు కాబోలు! అతనే. సందేహం లేదు. తనొచ్చిన పని మీదనే అతనూ వొచ్చాడా? అతనెవరు?

రోడ్డుమీద కొచ్చాడు వర్మ.

"అదుగో ఆ రాయిమీద కూర్చున్న మని షెవర్రా?' అనడిగాడు గంగణ్ణి.

"అరు సచ్చితానందంగారండి—మేస్త్రీ కాబోలు! ఇక్కడే తిరుగుతూంటారండి. గొట్టంలోంచి చూస్తూ. అదుగో తమ్మయ్యా.

ఆయనకి తెలుసుద్దండి' అని వారికేసి వొస్తున్న వ్యక్తిని చూపించాడు. ఆ వొచ్చిన వ్యక్తి తనకు చీటి తెచ్చిన తమ్మయ్య. అత నొక మేస్త్రీ. నమస్కారం పెట్టాడు.

"మీకేమన్నా పండ్లు తెద్దామని బైలుదేరానండి. ఇక్కడ మంచి సపోటా లున్నాయి, అనాస కూడా వుందంటారండి" అని స్వగతంగా చెబుతున్నాడు.

'మిమ్మల్ని కుటుంబం సామానుతో గనక వస్తే యిక్కడ బంగళాలో యీ రేత్రి గడిపి, రేపు మాచ్‌కండ్ రమ్మన్నారండి—మీ రొక్కరే గనకైతే యీ పూటే రమ్మన్నారండి, ఎక్కడో అక్కడ సర్దుకోవచ్చునని. వెడదామాండి.'

'ఈ పూట యిక్కడే వుంటాను. రేపు అమ్మగా రొచ్చింతర్వాత, అందరం కలిసే వెడదాం' అన్నాడు వర్మ. జీప్‌లో ఎక్కమని సంజ్ఞ చేశాడు, తమ్మయ్య ఎక్కాడు. లోయలో బంగళా కేసి పోతున్నారు.

'సీతో యిందాక వచ్చిన మరో వ్యక్తి ఎవరు?' అని అడిగాడు.

'సచ్చితానందమని, మా గొప్ప తెలివైన మనిషండి. డిగ్రీ. చదువు లేవంట, పై పన్లు చూస్తూ మేస్త్రీగానే జలపుట్ డామ్‌కాడ వుంచారండి, మాఫ్‌లు గీస్తాడు; సర్వే చేస్తాడు. ఏదో కొత్త కొత్తవి కనుక్కొని, బలే చురుకుగా పని సాగిస్తాడండి. అక్కడ యింజనీర్లందరూ, యీయన చేతే పన్లు చేయించుకుంటారండి....'

'అది సరే-డిగ్రీ ఎందుకు లేదు?'

'నాకు బాగా తెలవదండి. కాలేజీలో కొంతకాలం చదివాడంట. మరి, ఏం తిరకా సొచ్చిందో, పరీక్ష కెడతానికి లేకుండా కాలేజీలోంచి పంపించి వేశారు టండి....' అన్నాడు తమ్మయ్య. ఈ మాట వినగానే, వర్మకి, యింతవరకూ బాధిస్తున్న సందేహం తీరింది. సచ్చిదానందాన్ని కాలేజీలోంచి పంపించిన పంవత్సరమే అతను అక్కడ లెక్చరర్‌గా చేరాడు. వివరాలు జ్ఞాపకం లేవు. సచ్చితానందం, లేబరేటరీలోంచి రెండు వేలు ఖరీదైన టెలెస్కోప్‌ని

తీసుకుని, పోయిందన్నాడన్న ఫిర్యాదు చేసి, డబ్బు కట్టమ
అధికారులు. నేరమూ వొప్పుకోలేదు. డబ్బూ కట్టలేదు. అం
అతన్ని కాలేజీలోంచి పంపించి వేశారు, తరవాత ఏమయ్యా
ఎవ్వరికీ తెలీదు. అతనికి తల్లిదండ్రులు లేరు. మేనమామ
వయనం అడుగుతూ, ఎక్కడేనా కనిపిస్తాడేమో అని వెదుకు
వాడు. ఇంట్లోంచి పరారీ అయి యీ అడవిలో అవతరించా
మాట! ఆనాడు దొంగిలించిన టెలస్కోప్ అదే కాబోలు. ఈ
యాలన్నీ తెలిస్తే, అతని మేస్త్రీ వుద్యోగం వుంటుందా? కాని
కుండా అందరిలోనూ చెప్పేశాడు. చిత్రం! నేరస్థుడి గ
అహంభావం అట్లాంటివి కాబోలు! తనని గుర్తుపట్టాడా?
పంకించాడు కాని, నమస్కారం చెయ్యలేదు.

ఎంత అహం?

బంగళా దగ్గర కొచ్చాడు, నాలుగైంది. సూర్యుడు దూ
కొండ కిందికి దిగుతున్నాడు.

"ఇక్కడేం చేస్తున్నా డింతకీ?" అనడిగాడు వర్మ.

'అతను చేసేది వొకరకం పని గాదండి. అట్లా సైకిలు
తిరిగి ఏవో పరిశోధన చేస్తుంటాడండి. ఇసిక. రాళ్లు, వె
తవ్వడం, కొలవడం-ఏదో ఒకటి. ప్రస్తుతం వొంతిన పిచ్చిలో
డండి' అన్నాడు తమ్మయ్య.

'అంటే?'

'అటుకేసి అయిదారు మైళ్ళు వెడితే అతను కడుతున్నవొం
కనిపిస్తుంది అక్కడ వొక చిన్న నది వుందండి—పెద్ద
అనుకొండి. వర్షాలుపడితే బాగా నీరుంటుందండి. లేకపోతే
కొండల్లోంచి జలపాతాలుగా పడుకుంటూ, తిరుక్కుంటూ ప్రవ
స్తుందండి. ఆ నది వొరిస్సావారికి సరిహద్దండి, అక్కడ వొం
పడేస్తే, అటుజనం యిటు, యిటు జనం అటు సుళువుగా వెళ్ళి
పోకలు బలిసి, ఐకమత్యంగా కూలిజనం ఎగడతా రంటా దండి,
వొంతిన విషయం ఎవళ్ళకీ పట్టదండి. తనే స్వయంగా వేస్తా

చుట్టుపక్కల కొండజనాన్ని పోగుచేసి, పెద్ద చెట్లు కొట్టించి, వొంతిన మొదలు పెట్టాడండి....'

'పదండి చూద్దాం' అన్నాడు వర్మ. జీప్ ముందుకి నడు పుతూ. ఐదారు మైళ్ళ తర్వాత నది కనిపించింది, వొంతిన యింకా ఎగువున గుట్టల వెనక వుంది, అక్కడికి జీప్ వెళ్ళదు. నడిచి వెళ్ళా ల్సిందే. మూడు ఫర్లాంగులు నడిచారు. వర్మకి ఆయాసంగా వుంది; ఆకలేస్తోంది; దిగువున నది కనిపిస్తోంది; కాసేపు విశ్రాంతి తీసు కుందామని కూర్చున్నాడు. రాత్రి భోజనం ఏర్పాటు చెయ్యడానికి తమ్మయ్య వెడతానని సెలవు తీసుకు వెళ్ళాడు. గంగణ్ణి, వెనక్కి బంగళా దగ్గర దుకాణానికెళ్ళి, టీ తీసుకురమ్మని పంపించాడు.

వర్మ మరో పదడుగులు దిగింతర్వాత వొంగి చూస్తే, నీళ్ళల్లో వొక స్త్రీ స్నానం చేస్తున్న దృశ్యం చూశాడు, బైనా క్యులర్స్‌లోంచి చూశాడు. తాను మధ్యాహ్నం చూసిన స్త్రీయే. దగ్గ రగా వుండడం మూలాన బాగా స్ఫుటంగా కనిపిస్తోంది. నడుం లోతు నీళ్లు—కాసేపు యీది, మళ్ళా రాతిబండమీద కూర్చుంటోంది. చేతులకి ఎర్రగాజులు తప్ప, శరీరంమీద ఏ వొస్తువూ లేదు. కిందికి మెల్లగా దిగాడు. వొడ్డుకి చేరుకున్నాడు. ఆమె వెనకభాగం కనిపిం చింది. నడుంకి ఎర్ర లంగా బిగించి వుంది. ఇంకేమీ లేదు. లండన్ ఆర్టుగేలరీలో చూసిన పోతవిగ్రహాలు స్మరణ కొచ్చాయి. వయస్సు పాతికేళ్ళ లోపు. పరిపూర్ణంగా వికాసం పొందిన యౌవనం, నిర్మల మైన చర్మం, ఆ వొంపులు; వొయ్యారం, హుందాతనం అతన్ని ముగ్ధుణ్ణి చేశాయి. ఆదొక రాతివిగ్రహంఅవుతే, ఆ వక్షంపై తలపగల కొట్టుకోవా లనిపిస్తుంది, వెనక్కి తిరిగింది, భయంతో పదేపదే కళ్లు చిట్లించింది, మూసుకున్నా తెరుచుకున్నట్లు కనబడే పెద్దకళ్ళు. సృష్టి స్పృశించని యౌవనం కళ్ళల్లో, పళ్ళవరసలో మెరుస్తోంది. గోధుమ రంగు జుట్టు ఎండిన తుమ్మచెట్ల ఆకులు పెనవేసుకుంటున్నట్లు, నుదు టిని బిగించి, చిక్కుపడి గుబురుగా లేచింది. రెండు చేతులతో రొమ్ము కప్పుకుని బండమీద కూర్చుంది.

వర్మ మాట్లాడాడు. ఆ అమ్మాయికి అర్థం కాలేదు. పేరడి

గాడు. లోతుందా? అడుగున బురదా, యిసికా? చలేస్తోందా? సమాధానం లేదు, నవ్వుతోంది. ఏవో ధ్వనులు చేస్తోంది. చేతులు తిప్పుతోంది. నిండైన వక్షం, బలంతో పైకి నిట్టూర్చినప్పుడల్లా, లేచి పడుతోంది—చందమామ కోసం లేచిన సముద్రంలో కెరటానికి మల్లె. రెండుకొండల మధ్య లోయలాంటిది. అక్కడ నుదుటిని ఆనించి, కన్నుమూస్తే, శాంతి దొరుకుతుంది.

తెలుగు, ఇంగ్లీషు, హిందీ-అన్నీ యత్నించాడు. అర్థం కాలేదు. తను నీళ్ళల్లోకి వెళ్ళి అతన్ని రమ్మని సంజ్ఞ చేసింది.అతను ఆమె కేసి తీక్షణంగా చూడలేకపోతున్నాడు. ఏ అవయవం చూడడం? నడుమా, మెడా, జుట్టా, అలలుగా చెదిరిన నీళ్ళలోంచి ప్రతిబింబించి కనబడీ కనబడనివక్షమా? నీటిలో సూర్యకాంతి మొహాన్ని వెలిగించి, కళ్ళన్నీ కలవరపెట్టిన నగ్ననీడనా? పెదవులు దగ్గరగా మూసుకున్నప్పుడు చెక్కిలిమీద మిగిలిపోయి, కళ్ళలో దాక్కొని రహస్యంగా పిలుస్తున్న చిరునవ్వునా?

రమ్మంటోంది. ఆ ధైర్యానికి వర్మ చకితుడయ్యాడు. అతనికీతరాదు. నీళ్ళంటే భయం. అయినా, స్నానం చెయ్యాలనుంది. చొక్కా తీశాడు, బనీనుంది. తువ్వాలు లంగోటీలో కట్టి నీళ్ళలోకి దిగాడు. వేలుతో చూపించి నీ పేరేమిటన్నాడు. మూనా అంది. మోనాయో, మూనాయో, మొన్నాయో అతనికి తెలవలేదు. 'ము' 'న' రెండక్షరాలుగల ధ్వని ఆ పేరు. లినార్డో డవిన్సీ గీసిన మోనాలీసా చిత్రపటం జ్ఞాపకానికొచ్చింది. ఆ పటం, పారిస్‌లూవ్‌రీలో వుంది. అది 1504 లో గీయబడింది. ఆ పటాన్ని 'ఫ్రాన్‌సిస్కోడి గాయోకొండ' భార్య లీసా'ను చూసి వ్రాశాడు, వర్మ ఆ చిత్రం నకలుని ఇంగ్లండ్‌లో కొన్నాడు. ఈ దృశ్యం అట్లాంటిదే! వెనకాల రాళ్లకొండలు - యుగయుగాలుగా నిలిచిన కొండల - ప్రాచీన బలం, స్థిరత్వం ఆమె శరీరానికి అమరత్వాన్ని ఆపాదించినట్లు - ఆమె ప్రకృతిలో ఒక సజీవ భాగం. చలనంలేని ఆ సౌందర్యాన్ని మనిషి దూరంగా ఆరాధించగలడుగాని తాకలేడు. స్వచ్ఛమైన కళతో పరిచయం పెరిగినకొద్దీ, యధార్థ సంఘటన కళారూపాన్ని పొంది,

స్వప్నంలాగ. స్పృశించలేని దవుతుంది. కలని కెలికితే. కోటి తుంపరలుగా కదిలి కృశించి, కుంగి. వార్ధక్యంలో. మృత్యువులో మిశితమై. మరి కనబడదు కాని శరీరం వున్నంతసేపూ తాకక తప్పదు. జీవిత రంగంలో యీ పెనుగులాట తథ్యం. యథార్థ సౌందర్యాన్ని చూసి కలగంటాడా? కలలో చూసిన సౌందర్యాన్ని యథార్థ జీవితంలో చూసి తనది చేసుకుంటాడా? జీవితంపై ప్రభావంలేని కళకి ప్రయోజనం లేదు. ఆమె చెయ్యి పట్టుకుని రెండడుగులు వేశాడు. ఆమె దూరంగా లోతుకి వెళ్ళింది. సంధ్యలో వెలిగిన నీళ్ళకాంతి, వక్షంమీద పడి. మృదువైన చర్మంవెనుక రక్తాన్ని వెలిగించింది, అతను ముందుకు పడిపోయ్యాడు. చేతులు ఆమె మెడచుట్టూ పడ్డాయి, ముందుకు తోసేసింది. వెనక్కు పడ్డాడు. బండమీద కూర్చున్నాడు- ఆమెకేసి చూస్తూ. వెనక్కి తిరిగింది. వేళ్ళతో నీళ్ల చిమ్ముతోంది, వొంగిన చెట్ల చిటారుకొమ్మల ఆకులు సంధ్యవెలుగులో ఎర్రగా మండుతూ. నీళ్ళల్లోపడ్డ నీడలు పచ్చగా. ఎర్రగా ఆమె శరీరాన్ని వెలిగిస్తున్నాయి. ఆదిమరపురాని సౌందర్యానుభవం. సంధ్యని. వెన్నెలని, కొండ శిఖరాన్ని చూసి ఆనందించినట్లు,చూసి పొందిన ఆనందంతో తృప్తి పడకూడదు? సౌందర్యం మానవుణ్ణి యోగిగా చేస్తుంది. కాని తనలో మానవత్వమే. మళ్ళా మనిషిగా మార్చి వేస్తుంది. ఏదో శక్తి, స్వప్నంలో మెదిలిన కోరిక శరీరంలో ప్రజ్వరిల్లి అతన్ని ప్రాచీన ప్రాణిగా ముందుకు నెట్టి, తపస్సునుండి కార్యానికి రగిల్చింది. కార్యం తపస్సు నాశనహేతువు, యౌవనం నశింపకి, ప్రాణి చావుకీ యీ ప్రాకులాట, ఈ వుబలాటం, తనదిగా వుంచుకోవాలన్న ఈ వాంఛ కారణాలు కాబోలు! అనుకుంటూ ఆయాసం తీర్చుకుంటున్నాడు

వర్మ నిలబడ లేకపోతున్నాడు, నీళ్ళల్లో కూర్చునిఆమె వొళ్ళో పడిపోయ్యాడు చలిలో. అడివి కాలినట్లు, కొండబ్రద్దలై నిప్పు వ్యాపించినట్లు ఆమె శరీరం అతని చేతుల్లో, బుగ్గలమీద కాలింది. శరీరం కరిగినట్లు, ముద్దగా కాలినట్లు నరాలు దోవతెలీని రక్తంలో తన్నుకులాడుతున్నాయి. గడ్డం కింద చెయ్యిపెట్టి ఒక్కతోపుతోసి ఒడ్డుకి వెళ్ళింది

మూనా. పొదవెనక వుంచిన తెల్లగుడ్డ తెచ్చి, ముహం తుడుచుకుని. వక్షంమీద కప్పుకుంది. తడికి రొమ్ము మీద వస్త్రం బిగిపింది. కూర్చుని లంగా నీళ్లు పిండుతోంది. అతనూ వచ్చేశాడు. బనీను ఆరబెట్టుకుంటున్నాడు. ఒక్కసారి ఆ కాశం నల్ల మేఘాలతో చీక టైంది. చివరి సూర్యకిరణాలు విరిగిన కత్తులలా మేఘాల వెనక అదృశ్యమైనాయి. దట్టంగా నలుపుని పూరించుకుంటూ, శిఖరాల్ని తన్నుకుంటూ, మేఘాలు విజృంభించి ఆకసమంతా వ్యాపిస్తున్నాయి.

మేఘాలకేసి చూపించింది మూనా. ఇద్దరూ చరచరా నడిచి పోతున్నారు. వెనక మేఘాలు, సుడిగాలి, వూడిన ఆకులు, విరిగిన కొమ్మలు, తాకిడికి జారుతున్న పిల్లరాళ్ళ ప్రవాహం, అడివి కీటకాల కోలాహలం, మూనా శరీరంలోని వింతవాసన సుడిగుండంలా అతన్ని ముంచి వేస్తున్నాయి. నడవ లేకపోతున్నాడు. అతని చెయ్యి పుచ్చుకుని, పైకి లాక్కుపోతోంది. మూడు పెద్దరాళ్ళమధ్య ఒక గుహలోకి చేరుకున్నారు. వర్మ ఆయాసం తీర్చుకుంటున్నాడు. కిందికి చూశాడు. నదీప్రవాహం కనబడింది. కాళ్లు తేలిపోతున్నాయి. అతనికి భయం సాక్షాత్కరించినట్లుగా వుంది. పాపం చేసినవాళ్లు ఎత్తునుండి క్రిందికి చూడలేరని ఏదో మానసిక శాస్త్ర పుస్తకంలో చదివాడు. కిందికి చూడలేని భయం అతన్ని అల్పుణ్ణి చేసింది, గాలికి పడి పోకుండా ఉండేందు కన్నట్లు ఆమె మెడ గట్టిగా పట్టుకున్నాడు. అతని నెత్తిమీద వున్న తేనెపట్టులో వేళ్ళు పెట్టింది మూనా. కంతలలో కెలికి రాణియీగను లాగింది. మిగతా తేనెటీగలన్నీ జుయ్యిమంటూ సుడి గాలిలా బైటపడి అతన్ని ఆవరించి, కవ్వించి కుట్టేస్తున్నాయి. వర్మ పరుగులు సాగించాడు. అతన్ని సాగాలా చుట్టాయి తేనెటీగలు; మూనా నవ్వుతూ వెనకాల వొస్తోంది. అతని జేబులోంచి అగ్గిపెట్టె తీసింది. చిదుగులతో మంటచేసింది. పొగని తన నోట్లోకి తీసుకుని వాటిమీద వూదింది. వేళ్ళల్లో పట్టిన రాణీ యీగను వాటిముందు ప్రదర్శించింది. దూరంగా తీసుకెళ్ళి కంతలో రాణీ యీగను దాచింది, మిగతా ఈగ లన్నీ వర్మని విడిచి, దానిచుట్టూ కంతల్లోకి పోయాయి.

మూనా తొందరగా నడవమని సంజ్ఞ చేసింది. ఏదో పాట

మొదలెట్టింది. ఆ పాట వికృతంగా భయంకరంగా వినిపించింది ప్రకృతిలో ప్రాణి చనిపోయినప్పుడు, ప్రకృతంతా ఏడ్చినట్లు ధ్వనించింది. జీప్ కనబడటంలేదు. అతనికి దోవ తెలీడం లేదు. ఏదో తోవని ఎక్కడికో అడవిలోకి వచ్చేశారు. అన్నీ పెద్దపెద్ద రాళ్ళు, జుట్టు విరబోసుకుని, దయ్యాలకి మల్లే నల్లమ్రానుచెట్లు, గాలిలో దగ్గరగా జరిగి భేతాళ నృత్యం సాగించాయి. ఆకాశంలో పిడుగులు ప్రతిధ్వనిస్తున్నాయి. రాళ్ళు బ్రద్దలైనట్లు, శిఖరాలు కూలి నట్లు మెరుపులు ఒక్కసారంగా దట్టమైన చీకటిని చీలుస్తున్నాయి. ప్రకృతి గాయపడి, రక్తం కాలవలుగా ప్రవహిస్తున్నట్లు- మెరుపులు వురుములు వాళ్ళని తరుముతున్నాయి. ఇంక అతను నడవలేడు. మరో గుహ. మరో మెరుపు. వురుము - అక్కడే వాలిపొయ్యాడు. ఆమె బుజంమీద తెల్లగుడ్డ తీసి అతని తలని కప్పింది.

క్షణంలో వర్షం ప్రారంభమైంది. రాతిబండల మధ్య వాళ్లున్న స్థలం కాస్తంత పొడిగా వుంది. బీటలలోంచి వర్షం ధారలా పడు తోంది—దిక్కు తెలీకుండా ఆకాశంలో నిర్మాణమైన ముళ్ళ కర్మా గారంలోంచి పడినట్లు నలుదిక్కులా దుయ్యబడుతోంది. అతని తువ్వాలు, ఆమె పైబట్ట రెండు వైపులా బీటలలో బిగించి కట్టింది. అతని చేతులు, కాళ్ళు అరచేతులతో వేడికోసం రాస్తోంది. వర్షం లోపలికొచ్చి పడుతోంది. ఆమె మూలకి జరుగుతోంది. అతను ఆమెకేసి జరుగుతున్నాడు. అతని తల ఆమె వొడిలో పడి. చేతు లతో ఆమెమెడని పెనవేసుకుని దగ్గరగా వేడిని కాంక్షిస్తూ, యింకా దగ్గరగా వొస్తున్నాడు. ఆమె మోకాళ్ళమీద కూర్చుని గోడని ఆనింది. అతను గోడకు అదిమి, పైకి ఎగబాగుతున్నాడు. వేళ్లు ఆమె పెదవు లను వెదుకుతున్నాయి. ఒక చెయ్యి అతని గొంతుపైనవేసి, రెండో చేతితో గోడని ఆనుకొని ఒక్కసారి పైకిలేచి నిలబడింది మూనా. అతని తల తటాలున కింద రాతిమీద పడింది. 'అమ్మో' అన్నాడు. చిన్న గాయం తగిలింది. రక్తం చురుకుగా కారి వర్షం నీటిని ఎర్రగా మార్చింది.

వర్షం నిలిచింది. అతని తలకింద గుడ్డలు పెట్టింది.

గాయాన్ని కడిగింది. లేచి బైటకు వెళ్ళింది. పది నిమిషాల్లో వర్మ బైటకు వొచ్చాడు. గాయం తడిమి చూసుకున్నాడు. అంతా కారు చీకటి. జేబులో అగ్గిపెట్టి తడిసి వెలగడంలేదు. సిగరెట్టు కాల్చాలని వుంది—అవి తడిసి విడిపొయ్యాయి. దోవ తెలీడంలేదు. ఎటో పోతున్నాడు. మూనా ఏవో కేకలు వేసుకుంటూ వొచ్చింది. చెయ్యి పట్టుకుని నడిపించుకుంటూ తీసుకెడుతోంది. అక్కడంతా చదునుగా ఉంది. ఒక బండమీద కూర్చుని, అతని తల తొడమీద ఆనించి, తెచ్చిన ఆకులు పిండి రసం గాయానికి రాసి, ఆకులు పైనవుంచి గుడ్డ చించి కట్టుకట్టింది.

జీప్ నిలిచినచోటు దగ్గరలోనే వుంది. గంగడు కేకలేసు కుంటూ వొచ్చాడు. ఇద్దరూ అతన్ని జీప్‌లోకి జేర వేశారు. అతను డ్రైవ్ చేసేస్థితిలో లేడు. గంగడు తడిసి, చలికి వొణికి పోతు న్నాడు. మూనా, పావు గంటలో ముగ్గురు మనుషుల్ని తీసుకొచ్చింది. వారు జీప్ లాగుతూ, తోసుకుంటూ వెడుతున్నారు. ఆమె తన గుడిసెకి వెళ్ళింది.

జీప్ బంగళా చేరేప్పటికి రాత్రి పదకొండైంది. వర్మ అల్లాగే మంచంమీద వాలిపొయ్యాడు. గంగడు కాళ్ళూ, అవీ పడుతూ సపర్యలు చేస్తున్నాడు. వర్మ కళ్లుతెరిచి. లేచి కూర్చున్నాడు. బాగ్ లోంచి సిగరెట్ పాకెట్ విప్పాడు. సోమయ్యా, తమ్మయ్యా వాగన్‌లో విశాఖపట్నం వెళ్ళిపొయ్యారుట. వెళ్ళేముందు భోజనం, వడ్డనసామగ్రి, అన్నీ సిద్ధంచేసి వెళ్ళారు

వర్మ ఆకలి తీర్చుకున్నాడు.

'ఎవర్రా ఆ పిల్ల?' అని అడిగాడు గంగణ్ణి. నిద్రమత్తులో ఉలిక్కిపడి లేచి కళ్ళు నులుముకున్నాడు గంగడు.

'నువ్వెరుగుదువా?' అనిమళ్ళీ ప్రశ్నించాడు.

'ఎరక్కేమండి—కొండజాతోళ్లు. తండ్రీ లేడు. అవ్వుంది గుడిసికాడ. తనేమో ఇన్నాళ్ళూ తేనెతీసి అమ్ముతుండేది.'

'ఇన్నాళ్లూ అంటే?'

'ఇప్పు డింక సచ్చిదానందంగా రున్నారండి.' అని మెల్లిగా అన్నాడు.

'ఉండటం అంటే?'

'ఆయన ఆమె ఎప్పుడూ తిరుగుతుంటారండి - నెలకు పది రోజుల మకాం ఆమె గుడిసెలోనే.'

'వాళ్ళ భాషేమిటి?'

'ఒరియా కాబోలునండి, కొండజాతోళ్ళభాష మన కర్థం కాదండి.'

'మరి సచ్చిదానందాని కర్థమవుతుందా?'

'ఏమోనండి.'

వర్మ ఆలోచనలు కొత్త తోవతీశాయి. వాళ్ళిద్దర్నీ ఆ చల్లటి చెట్లనీడల్లో. సంధ్య వెలుగుల్లో పచ్చగడ్డిలో వెన్నెలకింద వూహించి బాధపడటంలో వొక ఆనందం పొందాడు. హెన్రీమూర్. రోడిన్, ఎప్‌స్టీన్, రాయ్‌చౌదరి శిల్పాలని స్ఫురింపజేసే మూనా శరీరం, ఆ వింతగడ్డం, చిరిగిన లాల్చి. దిగులుతో మూసుగునే నేత్రాలతో సచ్చితానందం పొందిన అనుభవం. అతనిలో కొంత ప్రవేశించి నట్లయింది. వర్మ మనస్సు వుద్రేకాలు ఉప్పొంగి, నీరసించాయి; కాని శరీరం వాంఛతో విజృంభిస్తోంది. దిండ్లకింద చేతులు, తల దాచుకున్నాడు.

మరునాడు వర్మ నిద్రనుండి లేచేటప్పటికీ ఏడు దాటింది. మండువాలో కొచ్చి చూశాడు. దూరాన మంచులో మసగగా మెరిసే పర్వత శిఖరాలు, విషాద కన్యలు ఆరేసిన ఆకుపచ్చ చీరలా విశాల మైన బయళ్ళు, చుట్టూ పల్చటి ముసుగులా ఆవరించిన మంచు. మంచు తుంపరలను ఇంద్ర ధనుస్సులుగా చీల్చిన సూర్యకిరణాలు, పరమాత్మగీసి, ప్రేమ్‌తో సహా అమర్చి. ఆకాశంలో తగిల్చిన తైల చిత్రంలా వుంది ఆ దృశ్యం.

క్షవరం, స్నానం, కాఫీ ముగించి వర్మ ఒంటిగా జీప్‌లో నదివైపు బైలుదేరాడు. తొమ్మిదైంది నదికి చేరుకునేటప్పటికి. రాత్రి వర్షానికి కాబోలు. నీరు వడిగా ప్రవహిస్తోంది. గట్లని కప్పిస్తూ

సుడిగుండంలో నాట్యంచేస్తూ. గట్లమీద పచ్చిక. రాళ్లు! పూల చీరలా వున్నాయి. జీప్ నిలిపి. రెండు ఫర్లాంగులు నడిచాడు. వొంతిన కనిపించింది. ఇంకా పూర్తికాలేదు. మరో నాలుగైదడుగులు మినహా వుంది. అవతలి వొడ్డుకు. అడ్డంగా రెండు మూడు దూలాలు పెద్ద త్రాళ్ళతో కట్టబడి, మధ్యమధ్య పెద్ద కర్రలు నాటి, వాటిమీద అడ్డంగా మరికొన్ని కర్రలు అమర్చబడి వున్నాయి. గట్లమీద బండలు, కొంచెం యిసక, దూలాలు కర్ర, గునపాలు, తాళ్లు వున్నాయి.

వర్మ ఆగిపోయాడు. రాతి బండలమీద నీడలో, మూనా బుజాలపై తల ఆనించి సచ్చిదానందం పడుకున్నాడు. ఆమె శరీరం లోని తీక్షణ శక్తి కొంత విడి తన దగ్గరకొచ్చినట్లయింది. క్రితం సాయింత్రం, ఆమెచేష్టలు జ్ఞప్తికొచ్చాయి. అతని చర్యలను ప్రబలంగా నిరసించింది. ఎందుకు? అది కవ్వించడమా? వేటకి రగల్చడమా? డబ్బాశా? సచ్చిదానందం ప్రేమతో తృప్తిపడిన పాతివ్రత్య ప్రకర్షా? కొండజాతి స్త్రీకి నీతి వుంటుందా? అదంతా నటన. రుజువు చేసుకోడానికి నిశ్చయించుకొని బంగళాకు వొచ్చేశాడు వర్మ.

పదకొండింటికి ఒక ఉత్తరం వ్రాసి సచ్చితానందాని కిమ్మని గంగణ్ణి పంపించాడు.

తనకి సర్వే నిమిత్తం కొన్ని పరికరాలు, పనిముట్లు కావాలి కాబట్టి, అతను వెంటనే మాచ్ కండ్ వెళ్ళి వాటిని తీసుకు రావాలని ఆజ్ఞాపిస్తూ వ్రాసిన ఉత్తరానికి సచ్చితానందం జవాబు మధ్యాహ్నం రెండింటికి పంపించాడు. తను మాచ్‌కండ్ అధికారుల ఉత్తర్వు ప్రకారం, నది ఎగువన కొన్ని కొలతలు పరిశోధనలూ జరపడానికి వెడుతున్నానని, మళ్ళా రాత్రికి కాని తిరిగి రాలేననీ, అంచేత ఆ పని తాను చెయ్యలేనందుకు క్షమించమనీ, అతను పంపిన జాబులో వుంది.

వర్మకి కోపం దిగమింగినకొద్దీ తీవ్రమై పోతోంది. అతని విషయం మాచ్‌కండ్ అధికారులతో చెప్పెయ్యడానికి నిశ్చయించుకున్నాడు. ఆ వొంతెన పూర్తి కావడానికి వీలులేదు. అది గట్టి వొంతెన కాదు; పది మంది నడిస్తే కూలిపోతుంది. దానివల్ల ప్రాణ

నష్టం కలుగుతుంది. దాన్ని పడగొట్టాలి... ఏవేవో భయంకరమైన ఆలోచనలు. కాని నిజంగా అవి ఆలోచనలు కావని అతనికి తెలుసు. ఆలోచననుండి ఇంద్రియాలు పారిపోతూ పడుతున్న తికమకలవి. ఊహ ఆలోచన లేకుండా వాక్కు శరీరం వికసించి, వ్యాపించి, స్థాయిపడటం ఎంత గొప్ప అనుభవం! అదే సమాధి, అదే నిర్వాణం. తను తన నాగరికత కృత్రిమం. ఈ దుస్తులు, వేషం, యీ భాష, భావాలు, ఆచారాలు. నియమాలు - అన్నీ అసహజం. సహజమైన జీవితంకోసం ఎందరో యోగిపుంగవులు సంఘాన్ని త్యజించారు,

కవులు ప్రకృతిలో ఏకాంతాన్ని కామించారు. వర్డ్స్‌వర్త్, షెల్లీ. తోరియో. టాల్‌స్టాయ్. విట్‌మన్, వేమన్న అల్లావీకాంతంలో సజీవు లయినవారే! దాన్ని వెదుకుతూ లారెన్సు ఎన్నోదేశాలు తిరిగాడు. చలంగారి హంపీకన్యల అన్వేషణ. చిత్రకారులు వాన్‌గో, గాగిన్‌ల లంకా ప్రవాసం-యివన్నీ ఆలోచననుండి పారిపోవడానికి చేసిన ప్రయత్నాల ఫలితాలే!

సచ్చితానందం వొకప్పుడు దొంగతనం చేశాడు; సంఘం నుండి పారిపొయ్యాడు.

ఈ అడవి ప్రదేశంలో దొంగెవరు? దొరెవరు? నిజాన్ని కొలిచే విలువలు లేవు. అబద్ధానికి వయస్సులేదు. నియమాలు. ఆచారాలు, పాపపుణ్యాలు, రాళ్ళుగా, చెట్లుగా, నదులుగా, చిరస్థాయిగా మారిపొయ్యాయి. వాటికి వయస్సులేదు; పరిణామం లేదు. అందులో వొకడై పొయ్యాడు. సచ్చితానందంమూనాతో కలిసి నగ్నంగా ఏడమ్ ఈవ్‌లకిమల్లె ఫలాలు, ఆకులు తింటూ, తేనె త్రాగుతూ, నదితో ఆడుకుంటూ చల్లటి నీడలమధ్య. గడ్డిలో ఆమెగుండెపై చెవిని ఆనించి, విశ్వం పరిభ్రమిస్తున్న నాదాన్ని, లయని వింటూ, ఆలోచనని ఆమె మెడలో పాతేసి. ఊహని ఆమెనడుంచుట్టూ తన చేతులతో కట్టేసి. ఋతువులతో మారుతున్న తృష్ణని ఆమె కనురెప్పల వెనక ముద్దులతో మూతపడేసి, ఆనందంతో భాషని వెదుకుతూ బైటపడిన నాలుకని ఆమె అధరంవెనక హత్యచేసి. నిశ్శబ్దంగా

కాలాన్ని కామంతో బంధించి. వారి వునికే లోకానికి తెలీకుండా అనంతంలో లీనమైన ఆ వ్యక్తుల జీవితం వర్మకు కావాలి. కాని. సాహసం లేదు; ఆ త్యాగం చెయ్యలేడు.

సంఘాన్ని విడిచిపెట్టి యేకాంతంలోకి పారిపోయినవారు. నిజంగా అక్కడ ఆనందంపొంది, తృప్తిపడతారని విశ్వసించడం కష్టం, మరో పదిమంది నగ్నదంపతులు అరకు లోయలో నివాసం యేర్పరుచుకుంటే, మళ్ళా అదొక చిన్న సమాజంగా తయారవు తుంది. అక్కడ స్పర్ధలు, అసూయలు, ద్వేషాలు, పగలు, రాజకీయాలు అదొక తాత్కాలికాను భవంకాని జీవితపరమావధి కాకూడదు. వీళ్ళందరూ ధైర్యం. త్యాగం అనుకుంటున్నది, నిజానికి పిరికితనమూ అసహాయతానూ,

తనకా ధైర్యంలేదన్న చైతన్యం వర్మని కార్యానికి పురిగొల్పింది, రెండైంది. స్నేహలత, సామాన్లు సాయంత్రం ఐదు, ఆరు గంటలకికాని రారు. వొచ్చినా, రాత్రి యిక్కడేవుండి, మొర్నాడు వెళ్ళడానికి నిశ్చయించుకున్నాడు. భార్యని తనతోచే తీసుకురానందుకు తన్నుతాను అభినందించుకున్నాడు. స్నేహలత మూర్తి ఊహలో మెదుల్తోంది. ఆమె సన్నంగా, నాజూకుగా,లతలా వుంది, తనని అల్లుకుంది. స్త్రీ అంటే 'ఒక ఎముక; పిడికెడి జుట్టు; గుడ్డపీలిక'....అని బర్న్సుకవి వర్ణన జ్ఞాపకానికొచ్చి నవ్వుకున్నాడు.అతని అరిచేతికింద గట్టిగా తగిలిన ఆమె బుజాల ఎమికెలు స్మరణ కొచ్చాయి.

గ్రహణంనాడు ఆమెతో సముద్రస్నానాని కెళ్ళిన ఘట్టం అతను మరిచిపోడు. నీళ్ళలోకి దిగగానే ఆ పల్చటి ఆకుపచ్చ చీర ఆమె తడిపిన శరీరాన్ని జ కించివేసి, అల్పమైన అవయవాల్ని ప్రదర్శించింది. నీటికి లంగ చుట్టుకుని, జుట్టంతా పిడికిటిలో అమరేటట్లుగా వుంది. నీటి బిందువులు బుజాల ఎముకవల్ల ఏర్పడిన గుంపులో నిలిచి పొయ్యాయి. జూలు కత్తిరించిన గుఱ్ఱంలా, రెక్కలూడిన పక్షిలా. ఎండిన కాలవలా....ఎల్లాగో ఐపోయింది. నడుం లోతు నీళ్ళ—పెద్ద కెరటం అతన్ని లోపలికి గెంటింది. చెయ్యి

పైకెత్తి పట్టుకోమని సంజ్ఞలు చేస్తున్నాడు. ఆమె గమనించలేదు తను
యిసకలోకి వెళ్ళింది. కూసం విడిచిన పాములా. మరో కెరటం
ముందుకు తోసింది. తనూ బైటపడ్డాడు. చీకట్లో అర్ధరాత్రి; 'ఫిఫ్త్
ఎవెన్యూ' పరిమళంలో, వారు చేసుకున్న ప్రేమ ప్రమాణాల విలువ
ఎంతటిదో అతనికి తెలిసొచ్చింది. అతనికి నీళ్ళంటే ఎంతభయమో,
ఆమెతో నిజం చెప్పడంకూడా అంతభయం. ఆ రాత్రికూడా సిగరెట్
పొగవొదుల్తూ, మళ్ళా ప్రమాణాలు. తెచ్చిపెట్టుకున్న ఉద్రేకంలోని
పల్చటి కన్నీరు—అంతా అందమైన భ్రమ! మూడైంది. అప్రయ
త్నంగా జీప్‌వద్దకు నడిచివెళ్ళాడు. లోపలికి ఎక్కాడు. అతని
ఊహలో వెన్నెల నక్షత్రాలు కదుల్తున్నాయి—నక్షత్రాలకేసి టెలి
స్కోపులోంచి చూస్తూన్న సచ్చితానందం సాటర్న్ గ్రహంచుట్టూ
వున్న 'రింగ్స్' ఆ టెలెస్కోపులో కనిపిస్తాయి. దిగ్భ్రమగొల్పే ఆ
వింత దృశ్యాన్ని 'మూనా'ని చూడమంటాడు. జ్యూపిటర్ గ్రహం
చుట్టూ తిరిగే చిన్న గ్రహాల నీడలు. అందులోంచి కనిపిస్తాయి.
విశ్వం నీలిపమిటలో దాచుకున్న వింతలన్నిటినీ చూస్తాడతను. చూసి
సాధించేదేమిటి? వొంతెన కట్టడానికీ, ఖగోళశాస్త్రానికీ ఏ సంబం
ధమూ లేదు. కాని ఎందుకు అట్లా చూడటం? చెట్టు కొమ్మమీద
కూర్చుని. సంధ్యవేళ పశ్చిమ ఆకాశంకేసి చూస్తూ కూర్చున్న సచ్చి
తానందం, అతని బుజంమీద తల ఆనించి నగ్నంగా కూర్చుని
వీనస్‌కేసి చూస్తున్న 'మూనా' అరకు లోయలో వొకదానిచుట్టూ
వొకటి తిరుగుతూవుండే గోళాలు.... 'టెలిస్కోపిక్ బైనరీస్'....
టెలిస్కోప్‌లోంచి తప్ప కనుపించవు. అతని ఊహ టెలిస్కోప్‌లా
ఆ దృశ్యాల రహస్యాన్ని బైటపెడుతోంది. పాతపత్రికలో ఆ నెలలో
ఆకాశం తీరును వర్ణించే పటాలు, వ్యాసం చూశాడు. అతనికేమీ
బోధపడలేదు. వీనస్ పశ్చిమ ఆకాశంలో, సూర్యాస్తమయం అవగానే
ఎక్కువ కాంతివంతంగా మెరిసి, అరగంటలో మాయమవుతుందట.

జీప్ నడుస్తోంది. అత నెక్కడికి వెతున్నాడు? జీప్‌లో
ఆకాశంలోకి ఎగిరి, కొన్ని కోట్ల సంవత్సరాలు అనంతంలో తిరిగితే
చివరికి యాదేస్థానానికి చేరుకుంటాడు. విశ్వం అనంతం కాదుట.

దానికి పరిమితి వుందట. స్థలం—తనపై పుకే వొంకర తిరిగివుందట-తను ఎక్కడికీ వెళ్ళలేడు. తిరిగి యిక్కడికే రావాలి!

ఎక్కడి కొచ్చాడు తను?

వొంతిన సమీపంలో కొచ్చాడు. జీప్ నిల్చి పోయింది. దిగువన లోయలో నది వడిగా ప్రవహిస్తోంది. నీటివడికి వొంతెన తెగలేదు, ఆ వొంతిన ప్రయోజనం ఏమిటి? ఎవరి అవసరాలకు వారు తలో వొంతిన స్వయంగా వేసుకుంటే ప్రభుత్వం ఎందుకు? పథకాలెందుకు? 'మూనా' ఒరియాపిల్ల-ఆ ఒంతిన వేస్తే. ఒరిస్సాప్రాంతం పనివాళ్ళంతా యిటొచ్చి పనులు సంపాదించుకుంటారు. మూనా బంధుకోటికి పనికల్పించడంతప్ప వేరే ప్రయాజనం ఏముంది? దానివల్ల నష్టం కూడా వుంది. ఇటువారు అటూ, అటువారు యిటూ వెళ్ళి వలస లేర్పరుచుకుంటారు. దానితో తగాదాలు బైలుదేరుతాయి. అంతేకాదు. ఒక్కసారిగా దానీమీద నో యాభై మంది నడిచారో-అది కూలి అంతా నీటిపాలవుతారు. ప్రాణనష్టం కలుగుతుంది,

వొంతిన చేరువలో, కొండమీదికి వచ్చేశాడు శర్మ.

కాస్త దూరంలో మరో ఎత్తుకొండ వుంది. దాని శిఖరానికి తిన్నగా దిగువన వొంతెన వుంది. అతని ఒక భావం స్ఫురించింది. గబగబ ఆ కొండమీదకి వెళ్లాడు. నాలుగైంది- నలువైపులా చూశాడు. ఎవ్వరూ జనం లేరు, కొండమీద పెద్ద పెద్ద బండలు వొరిగి. కదిపితే జారేకోణాలమీద నిలబడి వున్నాయి. ఏడెనిమిది పెద్దవి, చిన్నవి కనిపించాయి. ఒకదాన్ని కదిపి చూశాడు. చాలా పెద్దవి. అవి కదల్లేదు. దాని ముందుగా కొంచెం ఎత్తున నాలుగైదు చిన్న బండ లున్నాయి.

ఇంగ్లీషు సినిమాలలో దృశ్యాలు జ్ఞప్తి కొచ్చాయి. నాజూకు. నాగరికత—సహజమైన శక్తుల్ని 'కసిని', వుద్రేకాన్ని మరుగు పరుస్తున్నాయి. కాని ఆ ప్రచండ శక్తులు ఎప్పుడో వొకప్పుడు బైటపడక మానవు. అస లందుకే యుద్ధాలు, ప్రజలలో దాగిన 'తృష్ణ', 'కసి', 'పగ', 'పోటీపడటం'—మొదలైన అదిమానవుల వుద్రేకాలు బైటపడేటందుకే, కుస్తీపట్లు, 'బాక్సింగ్' మెదలైన

వినోదాలు పాశ్చాత్య దేశాలలో ప్రబలాయి. టార్జాన్ చిత్రాలంటే అందుకే ప్రేక్షకుల కంత మోజు. 'హెమింగ్ వే' యీరకం తన్నుకునే, గుద్దుకునే కథలు వ్రాశాడు—ఆ రచనలు వుత్తమ సాహిత్యం అంటున్నారు. లారెన్సు నవలలో నాయికా నాయకులు తిట్టుకుంటారు, తన్నుకుంటారు, హింపించుకుంటారు. రక్తంతో వినోదిస్తారు. లారెన్సును, సారస్వత గురువుగా పూజిస్తున్నారు. మన దేశంలో వీటికి స్థానంలేదు—ఇక్కడంతా శాంతి, మృదుత్వం దయ, క్షమ, ఔదార్యం, భక్తి, పాతివ్రత్యం, త్యాగం మొదలైన విలువలు, యీ ప్రాచీనశక్తుల భేతాళనృత్యానికి తయారుచేసిన వేదిక కూలిపోకుండా వుంటుందా?

చిన్న బండలని బలం అంతా వుపయోగించి, వర్మ వరసగా తోసేశాడు. అవి వెళ్ళి ఆ పెద్దబండలు మూడింటిని కదిపాయి. అన్నీ కలిపి కిందికి నదిలోకి శబ్దంచేస్తూ పడ్డాయి. రెండుమాత్రం వొంతెనమొగలోపడి నాలుగైదు గజాలుమేర వొంతెనకర్రలని కూల్చివేశాయి. ప్రకృతిహృదయం పగిలినట్లు పెద్దశబ్దం. మరుక్షణం ప్రకృతి ఆశ్చర్యంతో వూపిరి బిగబట్టినట్లు నిశ్శబ్దం.

ఆ నిశ్శబ్దాన్ని చీల్చుకుని వొక స్త్రీకంఠం వినబడింది. మూనా పాడుతున్న వికృతమైన, విషాదకంఠం అది. ముచ్చెమట్లు పోసేశాయి. ఆగ్గిపుల్లని నోట్లోపెట్టుకుని, సిగిరెట్లుని అగ్గిపుల్లగా రాస్తున్నాడు! ఆ కంఠం వల్లకాటిలో వేసినకేక ప్రతిధ్వనిలా ధ్వనించింది. తనని రమ్మంటోంది వెడుతున్నాడు! కిందికి యింకా కిందికి.

ఆ కంఠంవైపు ఊగుతున్నాడు. పాట దగ్గర కొచ్చింది. ఎదురుగా మూనా. గడ్డిపూలు రెండు చేతులకూ గాజులుగా అమర్చింది-ఎర్రపూలు చిక్కు జుట్టులో బిగించింది. ఎర్రటి పరికిణీ నిండా. పిరుగులు అతుకులు, నవ్వింది.

వర్మ సిగరెట్ పైకి తీశాడు. నీళ్ళల్లో కాళ్ళుపెట్టి వొడ్డున కూర్చుంది. ఏదో అంటోంది. నీళ్ళల్లోకి రమ్మనా? నీళ్లు బురదగా. వడిగా వున్నాయి. అతను దిగదల్చుకోలేదు. సిగరెట్టు ముట్టిం

... అతను వొదిలిన పొగను, తను వూదు[illegible]లుస్తోంది. పర్సులోంచి పదిరూపాయలనోటు తీశాడు. ఆమెకళ్లు సంతోషంతో మెరిశాయి. దగ్గరగా చూడ్డానికి వొంగింది బుజంమీది గుడ్డ జారినప్పుడు సంధ్య వెలుగులో రొమ్ముల నీడలు గుండ్రంగా రాతిబండ మీద పడుతున్నాయి. రెండు చేతులూ ఆమె బుజాన వుంచాడు. కిందికి జారుతున్న అతని వేళ్ళని తొలగించి, తన చేతులతో బిగించి అతన్ని లేవతీసింది. నోటు తీసుకుని పరికిణిలో మడిచింది.

వర్మకి ధైర్యం పెరిగింది—లేచాడు. ఆమె నడుస్తూంది—తనూ నడుస్తున్నాడు. పరుగెడుతూంది; తనూ పరుగెడుతున్నాడు. సంధ్య పడమటి ఆకాశంలో కరిగి, ఊహగా మారుతోంది. నీడలు పడడంలేదు; సన్నటి చందమామ నీటిలో ప్రతిబింబించటంలేదు, చందమామ ప్రక్క వొక నక్షత్రం పడమటి ఆకాశంలో మరో నక్షత్రం కనబడుతున్నాయి.

వొంతెన దగ్గర కొచ్చేశారు. ఆమె వొంతెనమీదకు నడిచింది, అతన్ని రమ్మంది, వొచ్చాడు. కింద నీటి వడికి తన తల తిరుగుతోంది, అతన్ని పట్టుగుంది, మెడచుట్టు చేతులువేసి దగ్గరకు లాక్కుని. బుగ్గలు, గడ్డం గిల్లుతూ, లోతుగా కళ్ళలోకి చూసి విరగబడి నవ్వింది, ఏదో అంటోంది, వర్మ శరీరం పట్టు తప్పి ఉద్రేకంతో వూగిపోతోంది. ఆమెను గట్టిగా కౌగిలించుకున్నాడు. అతని పెదవులు ఆమె మొహాన్ని తడుముతున్నాయి, గుండెమీద గుప్పిడి బిగించి, వొక్క వూపుతో ముందుకు తోసేసింది. వర్మ నీళ్ళల్లోపడి కొట్టుకుపోతున్నాడు.

కేకలు వేస్తూ, మునుగుతూ, తేల్తూ, చెయ్యి పైకి విసరి వేస్తూ కొట్టుకుపోతున్నాడు. కేకలు తగ్గాయి. నీళ్లు మింగుతూ శబ్దాలు చేస్తున్నాడు, పదడుగులు, పదిహేనడుగులు. ఇరవై—వెళ్ళిపోతున్నాడు: వొడ్డునున్న ఏదో రాతిబండ కాసేపు కాలికితగిలి నిలబడినా, పట్టుదొరక్క మళ్ళా కొట్టుకుపోతున్నాడు. ముప్ఫై నలభై అడుగులు—వెళ్ళిపోతున్నాడు, చేతులు నీళ్ళపైకి రావడం తగ్గుతోంది. శబ్దం సన్నగిల్లుతోంది. నది మలుపులో, వొడ్డున సచ్చితానందం చూశాడు.

సైకిలు పట్టుకు ఆనించి, లాల్చీ తీసేసి, డ్రాయరుతో, చేతిలో టెలి స్కోప్‌తో సహా, నీళ్ళలోకి దూకేశాడు. టెలిస్కోప్ వర్మ చేతికి తగిలి, దాన్ని గట్టిగా రెండు చేతులతో పట్టుకున్నాడు. సచ్చిదానందం టెలిస్కోపు పట్టు వొదలకుండా, వొక చేతితో వర్మ మొహాన్ని పైకి నెట్టుతూ, వొడ్డుకి చేరవేశాడు.

సంధ్య కరిగి చీకటి అలుముకుంటోంది. వొడ్డున పడిన వర్మకి ప్రథమచికిత్స చేసాడు; నీళ్లు తాగేసరికి వర్మ నిస్త్రాణగా కళ్ళు మూసుగుని పడుకున్నాడు. ఒడ్డున పొదల వెనక కీటకాలు చెల రేగాయి, అడివి కూసినట్లుగా. మందమైన ఆకులు రాలుతున్నాయి.

సచ్చితానందం వొళ్లు క్షణంలో ఆరిపోయింది. వెనక్కి చూశాడు. మూనా దూరంగా నిలబడివుంది. ఆమె కేసి నడిచాడు. అతని విడిచిన దుస్తులు ఆమె దగ్గరున్నాయి. ఒడ్డున కూర్చున్నాడు. మూనా తల తుడుస్తోంది. కణతలు నొక్కుతోంది. లంగా సద్దు కోడంలో, నోటు బైటపడింది. అతని కిచ్చింది. ఏదో మాట్లాడింది. అతను బట్టలు వేసుకున్నాడు. ఆమె సైకిల్ తీసుకుని నడుస్తోంది. అతను మెల్లగా నడుస్తూ టెలిస్కోప్‌లోంచి చూస్తున్నాడు. పశ్చిమ ఆకాశంలో ఎరుపు చిక్కనై నలుపైంది. 'వీనస్—' పెద్దగా మెరుస్తోంది. భూమి అంచు నిశీథి ముసుగులా కమ్మేసింది. వర్మ దగ్గరకు చేరుకున్నారు. అతని పంట్లాంజేబులో పర్సు తీసి, అందులో నోటు పెట్టి, ఆ జేబులోనే వుంచాడు. మళ్లా నడుస్తున్నాడు. రోడ్డు మీదికి వొచ్చేశాడు. దూరంగా అతనికేసి వొక వేగన్ వొస్తోంది. సంజ్ఞలతో దాన్ని నిలిపాడు. అందులోంచి సోమయ్య దిగాడు. అతని వెనకాల వర్మ భార్య స్నేహలత దిగింది, చలికి కాబోలు! ఆమె కొంగుని జుట్టుమీద, చెవులమీద కప్పుకుంది. ఆమెని అక్కడే వుండమని, సోమయ్యని డ్రైవర్‌ని తీసుకొని వర్మ దగరికొచ్చాడు. ముగ్గురూ సాయంపట్టి, అతన్ని వేగన్‌లోకి చేరవేశారు. ధ్వనికి ప్రశాంతత మైలబడుతుందేమో నన్నట్లు, ఎవ్వరూ మాట్లాడటంలేదు. దూరంగా నది మూలుగు, కీటకాలరొద, శిఖరాలపై వికృతంగా బండలు, వాటి మధ్య 'వీనస్' వెలుగు-జల్లుచేసిన పరమాత్మ అర

కులోయలో అడుగు పెట్టినట్లు, శూన్యం సజీవమైన క్షణాలు గడిచాయి.

వేగన్‌లో చిన్న దీపం వెలుగులో వర్మ కళ్ళు తెరిచాడు. చూట్టూ చూశాడు. భార్య మొహం చూసి నీరసంగా నవ్వాడు.

'అసలేం జరిగింది?' అని అడిగింది స్నేహలత, ఏ ఒకర్నీ సంబోధించకుండా. విశ్వంచేసిన కడసారి గానానికి శ్రుతిలా ఆ కంఠం అసహజంగా వినబడింది.

వర్మ మాట్లాడబోయాడు. వద్దని, సంజ్ఞచేసి, సచ్చితానందం సమాధానం చెప్పాడు.

'ఏంలేదండీ—నేను సర్వే పూర్తిచేసుకుని రోజూలాగే నది మధ్యగా వొంగిన ఆ చెట్టుకొమ్మమీద కూర్చుని 'వీనస్' గ్రహం కనిపిస్తుందేమోనని టెలిస్కోప్‌లో చూస్తున్నాను. పట్టుజారి నీళ్ళలో పడిపోయాను. ఒడ్డున వస్తున్న వర్మగారు నన్ను చూసి నీళ్ళలోకి దూకి, ఇద్దరం ఒడ్డుకు చేరడంలో నీళ్లు తాగేశారు.

వర్మ కళ్లు తెరిచి జాలిగా అతనికేసి చూశాడు చెయ్యి పైకి తీసి అతని భుజంమీద వుంచాడు. యేదో మాట్లాడబోయాడు. సోమయ్యకి దగ్గరగా రమ్మని సంజ్ఞచేసి, అతని చెవులో ఏదో చెప్పాడు. 'మీరు విశ్రాంతిగా పడుకోండి. ఒంతెన గురించి అదుర్దా పడకండి. ఆ పనికి మీరెందుకు? మే మందరం పూర్తిచేస్తాంగా' అన్నాడు సోమయ్య.

వేగన్ బంగళాకేసి నడుస్తోంది. స్నేహలత వీనస్‌కేసి చూసింది. తన భర్తకి యీదడంరాదనీ. నీళ్ళంటే భయమనీ ఆమెకు తప్ప ఎవ్వరికీ తెలియదు. ఈరహస్యం ఎవ్వరితో చెప్పనులే అన్నట్లు 'వీనస్' శిఖరం వెనుక లోయలో, భూమి అంచు వెనక దిగి అంతర్ధానమైంది. కూలిన శిఖరంగా అరకులోయ చీకటి సౌందర్యం ముసుగులా పైకి లాక్కుని పడుంది.

———